క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక



కొత్త కార్యవర్గ సభ్యులు

రాజాం: స్థానిక ఎఫ్‌సీ గొడౌన్ సమీపంలో మండల రేషన్ డీలర్ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా ఉరిటి సురేంద్ర, గౌరవాధ్యక్షుడిగా సామంతుల సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా వెంపల వీర్రాజు, ప్రధాన కార్యదర్శిగా టంకాల లలితకుమారి, కోశాధికారిగా వాకముల్ల జోత్స్నాదేవిలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



ఎస్‌ఐ గోపాలరావు

సంతకవిటి: పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా గోపాలరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన షేక్ శంకర్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో ఎల్.కోట ఎస్‌ఐగా చేస్తున్న గోపాలరావు వచ్చారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

చురుగ్గా ఈకేవైసీ నమోదు



కందిశలో రైతులతో ఈకేవైసీ చేయిస్తున్న వ్యవసాయ సిబ్బంది

రేగిడి: మండలంలోని కందిశ, తునివాడ, వెంకంపేట తదితర గ్రామాల్లో ఈకేవైసీ నమోదు చురుగ్గా జరుగుతోంది. ఇదివరకు రైతులు సాగు చేస్తున్న పంటలకు సంబంధించి, ఈ-క్రాప్ నమోదు చేయడం జరిగిందని, ఇప్పుడు రైతులతో ఈకేవైసీ చేయిస్తున్నామని ఏవో మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. అన్ని గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఈకేవైసీ జరుగుతోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏఈవో విజయలక్ష్మి, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

పోలిపల్లి పైడితల్లి హుండీల ఆదాయం లెక్కింపు



కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని పోలిపల్లి పైడితల్లి హుండీల్లోని ఆదాయం శుక్రవారం లెక్కించారు. దేవదాయ శాఖ తనిఖీదారు పీవీ లక్ష్మి సమక్షంలో హుండీలు తెరిచి, నగదు లెక్కపెట్టారు. మొత్తం 103 రోజులకు గాను రూ.2,06,491లు సమకూరిందని ఈవో బీవీ మాధవరావు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వాకచర్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ఏచూరికి ఘనంగా నివాళులు



ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న దృశ్యం

బొబ్బిలి: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ కూడలిలో సీపీఎం బొబ్బిలి డివిజన్ ఆధ్వర్యంలో సీపీఎం ప్రధాన కార్యదర్శి ఏచూరి సీతారాం చిత్రపటానికి పూలమాలలు వేసి, శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకుడు పొట్నూరు శంకరరావు.. నిరుపేదలు, కార్మికులు, రైతుల సంక్షేమం కోసం సీతారాం పోరాడిన తీరును కొనియాడారు. ఏచూరి ఆశయ సాధన దిశగా అందరం అడుగులు వేద్దామని పిలుపునిచ్చారు. ఆయన లేని లోటు పార్టీకి తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో యుగంధర్, వాసు, శంకరరావు, రామారావు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



అల్బెండజోల్ మాత్రలు అందజేస్తున్న ఎంపీడీవో శ్యామలాకుమారి

రేగిడి: మండల పరిషత్ కార్యాలయంలో డీ వారిమ్మింగ్ డే కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఎంపీడీవో శ్యామలాకుమారి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ నెల 17వ తేదీన నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని ఎంపీడీవో సూచించారు. కార్యక్రమంలో రేగిడి పీహెచ్‌సీ సీహెచ్‌వో సుందరేశ్వరరావు, సూపర్‌వైజర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి

- మండల సర్వసభ్య సమావేశంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు





మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (ఇన్‌సెట్‌లో) తాగునీటి సమస్యపై ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్

తెర్లాం: గ్రామాల్లోని సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన ఆయన.. పార్టీలకతీతంగా గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని కోరారు. అంతకు ముందు వివిధ శాఖలకు సంబంధించి, సమీక్ష నిర్వహించారు. విద్యుత్ శాఖ సమీక్షలో పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తమ ప్రాంతాల్లోని విద్యుత్ సమస్యలను లేవనెత్తగా జెడ్పీ చైర్మన్ స్పందిస్తూ విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. వర్షాల నేపథ్యంలో విద్యుత్ సమస్యలు తలెత్తితే ఆ సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరి చేయాలన్నారు. విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారానికి జిల్లా పరిషత్ నిధుల నుంచి మండలానికి రూ.10 లక్షలు మంజూరు చేస్తామన్నారు. వ్యవసాయ శాఖ సమీక్షలో రంగప్పవలస సర్పంచ్ శనపతి రాంబాబు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు మొక్కజొన్న పంటకు పూర్తిగా నష్టం వాటిల్లిందని, ఆదుకోవాలని కోరగా, జిల్లాను యూనిట్‌గా తీసుకుని, మొక్కజొన్న, ఇతర పంటలకు ఏ మేరకు నష్టం వాటిల్లిందో గుర్తించాలని, అవసరమైన రైతులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చేందుకు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలను గ్రామాలకు పంపించాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయ అధికారి రామారావుకు జెడ్పీ చైర్మన్ చెప్పారు. నీటిపారుదల శాఖ సమీక్షలో ఇటీవల కురిసిన వర్షాలకు గండ్లు పడిన చెరువులకు మరమ్మతు పనుల విషయమై ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించాలని మండల ఇరిగేషన్ ఏఈ హరికి తెలిపారు.

మదుములు బాగుచేయండి..

చెరువుల మదుములు బాగు చేయాలని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కోరగా, వాటికి సంబంధించి ప్రతిపాదనలు తయారు చేసి, పంపించాలన్నారు. ఉపాధి హామీ పథకంపై సమీక్ష నిర్వహించగా, ఆగస్టు 23వ తేదీన జరిగిన గ్రామ సభలో ఎన్ని పనులు తీర్మానం చేశారని, ఎంతమేరకు నిధులు అవసరమని గుర్తించారని మండల ఉపాధి ఏపీవో సుశీలను జెడ్పీ చైర్మన్ ప్రశ్నించారు. మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో 3520 పనులు గుర్తించామని, రూ.వెయ్యి కోట్లు అవసరమని ప్రతిపాదనలు తయారు చేశామని ఆమె బదులిచ్చారు. గ్రామసభలో ఏ పనులు గుర్తించారో వాటికి మండల తీర్మానం చేసి, జిల్లా పరిషత్‌కు పంపించాలని ఎంపీపీ ఉమాలక్ష్మి, ఎంపీడీవో శంబంగి రామకృష్ణకు ఆయన తెలిపారు. గృహ నిర్మాణ శాఖ సమీక్షలో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపుల్లో ఎటువంటి జాప్యం జరగకుండా చూడాలని మండల గృహ నిర్మాణ శాఖ ఏఈకి చెప్పారు. ఆర్.డబ్ల్యూ.ఎస్ శాఖ సమీక్షలో పెరుమాళి తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డీఈ పీఎంకె రెడ్డి, ఏఈ శ్రీనివాసరావులకు జెడ్పీ చైర్మన్ తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ లూర్దు, వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, పి.రమాదేవి, మండల ప్రత్యేకాధికారి రామారావు, ఎంపీడీఓ రామకృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సన్మానం



తెర్లాం: ఎస్‌ఐ సాగర్‌బాబును సన్మానిస్తున్న ఎంపీపీ ఉమాలక్ష్మి, ఎంపీడీవో రామకృష్ణ



రాజాం: ఉపాధ్యాయుడు నాయుడును సత్కరిస్తున్న జెడ్పీటీసీ నర్సింహులు

రాజాం: మండలంలోని పెనుబాక గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు ఆర్‌వీజే నాయుడును శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఇదే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు మాట్లాడుతూ ఓ వైపు ఉపాధ్యాయుడిగా సేవలందిస్తూనే మరోవైపు రాజాం గ్రీన్ బెల్ట్ ఏర్పాటు చేసి పర్యావరణ పరిరక్షణకు నాయుడు కృషి చేయడం అభినందనీయమన్నారు. ఆయనకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడంతో పాటు పట్టణ, పట్టణ పరిసరాల్లో 1200 మొక్కలు నాటిన నేపథ్యంలో ఈ సత్కారం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎ.మహేశ్వరరావు, సర్పంచ్ బి.బోడమ్మ, జెడ్పీటీసీ బి.కోటేశ్వరి, ఉపాధ్యాయులు పి.మధు, కె.మధు, లక్ష్మి, బలరామ్మూర్తి, ఉమామహేశ్వరరావు, బి.కృష్ణ, ఎస్‌ఎంసీ చైర్మన్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: మండల పరిషత్ కార్యాలయంలో విజయవాడ వరద బాధిత ప్రాంతాల్లో సేవలందించేందుకు వెళ్లిన అధికారులు, పారిశుధ్య సిబ్బందిని ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, ఎంపీడీవో శంబంగి రామకృష్ణలు శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ నీలిమ, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

బాలికా సంరక్షణకు కృషి చేయాలి



మాట్లాడుతున్న జిల్లా కౌన్సిలింగ్ అధికారిణి రమాదేవి

రామభద్రపురం: ప్రతిఒక్కరూ బాలికా సంరక్షణకు కృషి చేయాలని జిల్లా కౌన్సిలింగ్ అధికారిణి రమాదేవి, ఎన్‌జీవో జాన్సీరాణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రమామణి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో శుక్రవారం సమావేశమైన వారు.. బాలలు, మహిళల చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు, మానవ అక్రమ రవాణా, మహిళలపై లైంగిక వేధింపులు జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ వెంకటరమణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సూర్యకుమారి, కృష్ణకుమారి, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

మేస్త్రీలకు బైక్‌లు, టీవీలు అందజేత



బైక్ తాళం అందిస్తున్న కంపెనీ ఏవీపీ పట్టాభిరామి రెడ్డి, జీఎం కేన్ రమేష్

రేగిడి: మండలంలోని సంకిలి దగ్గరున్న ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం పరిధిలో చెరకు నరికివేత పనులకు తుని నుంచి వచ్చిన కూలీల మేస్త్రీలకు బైక్‌లు, టీవీలను కర్మాగారం యాజమాన్యం శుక్రవారం కర్మాగారం ఆవరణలో అందించింది. 2023-24 సీజన్‌కు గాను తక్కువ సమయంలో ఎక్కువ చెరకును నరికి, కర్మాగారానికి, రైతులకు సహకరించిన ముఠాల(కూలీల గుంపు) తాలూకా నలుగురు మేస్త్రీలకు బైక్‌లు, మరో 13 మందికి టీవీలు అందించినట్లు కంపెనీ సీనియర్ ఏవీపీ పట్టాభిరామి రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ సీనియర్ జనరల్ మేనేజర్ డాక్టర్ షణ్ముఖసుందరం, కేన్ డీజీఎం రమేష్, హెచ్‌ఆర్ మేనేజర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాల నిర్వహణ బాగుండాలి



ఎంపీడీవోతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి నిర్మలకుమారి

రాజాం: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ బాగుండాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి ఎస్.నిర్మలకుమారి సూచించారు. మండలంలోని కొఠారిపురం గ్రామంలోని చెత్త సంపద తయారీ కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించిన ఆమె.. కేంద్రాల వద్దనే ఎరువులు తయారు చేసి, ఆ ఎరువులతో అక్కడే కూరగాయలు పండించాలని తెలిపారు. ప్రతీ పంచాయతీలో చెత్త సేకరణ జరగాలని, నిలుపుదల చేసిన పంచాయతీల్లో వెంటనే పునరుద్ధరించాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావుకు అన్నారు. కావాల్సిన చోట పారిశుధ్య కార్మికులను కొత్తగా నియమించుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారి పరారీ



గ్లాస్ హౌస్ ముందు ఆందోళనకారులతో మాట్లాడుతున్న పోలీసులు

రాజాం సిటీ: పట్టణంలోని శ్రీ ఆంజనేయ గ్లాస్ హౌస్ యజమాని పిల్లల శ్రీనివాసరావు నాలుగు నెలలుగా పరారీలో ఉన్నాడని ఆరోపిస్తూ స్థానిక శ్రీకాకుళం రోడ్డులోని ఓ హార్డ్‌వేర్‌షాపు వద్ద శుక్రవారం కొంతమంది బాధితులు ఆందోళన చేపట్టారు. షాపును తెరుస్తున్నారని తెలుసుకున్న బాధితులు అక్కడికి చేరుకుని ఆందోళనకు దిగారు. తమ వద్ద డబ్బులు అప్పుగా తీసుకుని పరారవడంపై లబోదిబోమన్నారు. ఇదిలా ఉండగా పరారీలో ఉన్న వ్యాపారి సుమారు రూ.3 కోట్ల మేర అప్పులుచేసి ఐపీ పెట్టినట్లో తెలుస్తోంది. శ్రీను తమకు డబ్బులు ఇవ్వాల్సి ఉందని, షాపును ఎందుకు తీస్తున్నారని బాధితులు ఆందోళనకు దిగారు. దీంతో షాపు అసలు యజమాని దీనిని మరొకరికి అద్దెకు ఇచ్చామని చెప్పారు. ఈ విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న పోలీసులు పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. అయితే బాధితుల్లో కొంతమందికి ఐపీ నోటీసులు కూడా వచ్చినట్లు సమాచారం.

'ఉపాధి' పనుల్లో అక్రమాలను సహించం

బొబ్బిలి రూరల్: ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలు జరిగితే సహించేది లేదని ఏపీడీ లక్ష్మణరావు హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ అరసాడ శంకరరావు అధ్యక్షతన ఉపాధి హామీ పథకం పనులపై చేపట్టిన సోషల్ ఆడిట్ వివరాల వెల్లడి కార్యక్రమం శుక్రవారం జరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లో 2,148 పనులకు గాను రూ.26.12 కోట్లకు పైగా నిధులు ఖర్చు చేసినట్లు తెలిపారు. కొన్నిచోట్ల నిధుల దుర్వినియోగం జరిగినట్లు తేటతెల్లమైందని, ఏ మేర అక్రమాలు జరిగాయన్న విషయం త్వరలో వెల్లడిస్తామన్నారు. కార్యక్రమంలో డీవీడీ వెంకటరమణ, ఏపీ వెంకటరమణ, సూపరింటెండెంట్ బాబూజీ, స్టేట్ కో-ఆర్డినేటర్ మన్మధరావు, ఎంపీడీవో రవికుమార్, హౌసింగ్ ఏఈ ఎ.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పారాది కాజ్‌వే మరమ్మతులు

బొబ్బిలి రూరల్: వరదల కారణంగా ధ్వంసమైన మండలంలోని పారాది కాజ్‌వే మరమ్మతులు శుక్రవారం చేపట్టారు. వంతెన రోడ్డుపై ఉన్న పెద్దపెద్ద గోతులను పూడ్చి సమతలం చేస్తున్నారు. త్వరలోనే కాజ్‌వేను అందుబాటులోకి తీసుకువస్తామని ఆర్‌అండ్‌బీ జేఈ రాజు తెలిపారు. ఇదిలా ఉండగా, శాశ్వత రోడ్డు నిర్మాణం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

'పొలంబడి'

రేగిడి: మండలంలోని చాటాయివలస, ఉప్పర్నాయుడువలస, గుళ్లపాడు గ్రామాల్లో పొలంబడి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మురళీకృష్ణ వరి సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు, ఐసీఆర్‌పీలు తవిటినాయుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా చేయొద్దు

రేగిడి: తాగునీటిని వృథా చేయవద్దని ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ శ్రీచరణ్ సూచించారు. మండలంలోని సంకిలి, బొడ్డవలస, ఉంగరాడ గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ తాగునీటి పైపులైన్లను శుక్రవారం పరిశీలించిన ఆయన.. పంచాయతీల్లో తాగునీటి కుళాయిల పనితీరుపై ప్రజాప్రతినిధులు దృష్టిసారించాలని, ఎక్కడైనా ఏదైనా సమస్య ఉంటే తమకు వివరాలు తెలియజేయాలన్నారు. చిన్నచిన్న మరమ్మతులను ఆయా పంచాయతీల కార్యదర్శులే బాగుచేసేలా చూడాలన్నారు.

పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలి

బొబ్బిలి/రాజాం/రేగిడి: మండలాల్లోని అన్ని గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో పౌష్టికాహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. రాజాం మండలంలోని సోపేరు గ్రామంలో ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, బొబ్బిలి మండలంలోని పాతబొబ్బిలిలో ఐసీడీఎస్ పీవో జె.విజయలక్ష్మి, రేగిడి మండలంలోని లచ్చారాయపురంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శశికళ మాట్లాడుతూ.. మెరుగైన ఆరోగ్యానికి గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ మనం తీసుకునే ఆహారంలో పౌష్టికాహార పదార్థాలు ఉండేలా చూసుకోవాలని తెలిపారు.

కౌలురైతుల ఆందోళన

రేగిడి: పంట నష్టపరిహారం అందివ్వాలని కౌలు రైతులు ఆందోళనకు దిగారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకుడు మామిడి ఆనందనాయుడు వారికి మద్దతు తెలిపారు. ఎకరాకు రూ.10 వేలు నష్టపరిహారం అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, ఆ నగదు తమకు కూడా అందేలా చూడాలని కౌలురైతులు విజ్ఞప్తి చేశారు. అనంతరం తహసీల్దారు ఎల్లారావుకు వినతిపత్రం అందజేశారు.

నేడు కోడూరుమాత యాత్ర



చర్చి ఆవరణలో టెంట్లు ఏర్పాటు చేసిన దృశ్యం

బాడంగి: మండలంలోని కోడూరు పుణ్యక్షేత్రంలో కోడూరుమాత(పరిశుద్ధ మరియమ్మ) యాత్రా మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 24 ఏళ్లుగా ఏటా సెప్టెంబరు రెండో శనివారం నిర్వహించే ఈ పండగకు ఉత్తరాంధ్ర ప్రాంతాల నుంచి కొన్ని వేల సంఖ్యలో భక్తులు వచ్చి, అమ్మవారి ఆశీర్వాదం పొందుతారు. ప్రస్తుతం ఈ యాత్ర కోసం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, సాలూరు బస్‌డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా బాడంగి-పిన్నవలస జంక్షన్ నుంచి పిన్నవలస మీదుగా కోడూరు చేరుకుని, తిరిగి రామచంద్రాపురం మీదుగా వాహనాలు వెళ్లేలా చర్యలు చేపట్టారు. వర్షం పడినా తడవకుండా టెంట్లు ఏర్పాటు చేశామని ఫాదర్ యుగల్‌కుమార్ తెలిపారు.

14 వేల ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు లక్ష్యం



వీరసాగరంలో చేస్తున్న ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏవో శిరీష

బాడంగి: మండలంలోని 14 వేల ఎకరాల్లోని పంటలకు సంబంధించి, ఈ-క్రాప్ నమోదు చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని ఏవో కె.శిరీష తెలిపారు. మండలంలోని వీరసాగరం గ్రామంలో చేస్తున్న ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను ఆమె శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతీ రైతు తమ పంటలకు సంబంధించి, ఈ-క్రాప్ నమోదు చేసుకుంటే రైతు సేవా కేంద్రం వద్ద పంటను సులభంగా విక్రయించుకునేందుకు వీలుంటుందన్నారు. ఇప్పటివరకు మండల వ్యాప్తంగా 13 వేల ఎకరాల మేర ఈ-క్రాప్ నమోదు పూర్తయిందన్నారు. వర్షాలకు నీటమునిగిన పంటలు పాడవ్వకుండా జాగ్రత్త వహించాలని రైతులకు సూచించారు. ఏ పంట అయితే వరదనీటిలో మునిగిందో ఆ పంటకు పాముపొడ, ఆకుముడత, పచ్చపురుగు వంటి తెగుళ్లు సోకే ప్రమాదం ఉందని, ఆయా తెగుళ్ల నివారణ కోసం రెండు మిల్లీలీటర్ల హెక్సాకొనజాల్ ద్రావణాన్ని లీటరు నీటిలో కలిపి ఎకరాకు 400 మిల్లీలీటర్లు పిచికారీ చేయాలని తెలిపారు.

గ్రామసభల తీర్మానాలు సేకరించండి



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు

రామభద్రపురం: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ఆగస్టు 23వ తేదీన నిర్వహించిన గ్రామసభల తీర్మానాల సేకరణను వేగవంతం చేయాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రమామణి, ఏపీవో త్రినాధరావులతో శుక్రవారం సమావేశమైన ఆయన.. మండలంలోని 22 పంచాయతీల్లో ఏయే పంచాయతీల నుంచి ఉపాధి హామీ పథకం పనుల తీర్మానాలు సేకరించారని ఆరాతీశారు. తీర్మానాల ద్వారా వచ్చిన అభివృద్ధి పనులకు ఇంజినీరింగ్ అధికారులు అంచనా విలువలు రూపొందిస్తున్నారని ఎంపీపీ దృష్టికి తీసుకువచ్చారు. 14వ తేదీ సాయంత్రంలోగా తీర్మానాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ తెలిపారు.

మండల ప్రత్యేక సమావేశం



సమావేశానికి హాజరైన అధికారులు

మెంటాడ: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు ఆధ్వర్యంలో మండల ప్రత్యేక సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులంతా కలిసి ఆగస్టు 23వ తేదీన అన్ని గ్రామ పంచాయతీల్లో జరిగిన గ్రామసభల్లో గుర్తించిన ఉపాధి హామీ పథకం పనుల ఆమోదంపై చర్చించారు. ఇదిలా ఉండగా, మండల కేంద్రంలోని అనంతసాగరం చెరువు కింద భూములకు గ్రీన్‌ఫీల్డ్ హైవే కారణంగా సాగునీరు వెళ్లడం లేదని, మదుములు ఏర్పాటు చేయాలని, ఆంధ్ర జలాశయం ఎడమకాలువ గండి పూడ్చాలని, మండలానికి పశువుల షెడ్లు కేటాయించాలని, చెత్త సంపద తయారీ కేంద్రాలు, శ్మశానవాటికల వద్ద మొక్కలు నాటాలని పలువురు కోరారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, ఎంపీడీవో త్రివిక్రమ్, వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, ఏవో గోకుల్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విరాళాల సేకరణ



బొబ్బిలి: ఎమ్మెల్యే బేబీనాయనకు విరాళం అందజేస్తున్న డాక్టర్ గోపీనాథ్

వంగర: విజయవాడ వరద బాధితుల సహాయార్థం మండల కేంద్రంలోని వివేక్ మాస్టర్ మైండ్స్ పాఠశాలలో విరాళాల సేకరణ శుక్రవారం చేపట్టారు. సిబ్బంది, విద్యార్థులంతా తమకు తోచిన సాయం అందించారు. మొత్తం రూ.10 వేలు సేకరించామని, వీటిని జిల్లా ప్రైవేటు పాఠశాలల కమిటీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని పాఠశాల డైరెక్టర్లు కె.పారినాయుడు, ఎం.నేతాజీ, ప్రిన్సిపాల్ బి.ఈశ్వరరావులు తెలిపారు.

బొబ్బిలి: విజయవాడలోని వరద బాధితుల కోసం ఇండియన్ మెడికల్ అసోసియేషన్, బొబ్బిలి తరఫున ఆ సంఘ ప్రతినిధులు డాక్టర్ అర్నిపల్లి గోపీనాథ్, అక్కేన దివాకర్‌లు రూ.1.10 లక్షలను విరాళంగా శుక్రవారం అందజేశారు. లక్ష్మీబాలాజీ ప్రమోటర్స్(జూట్‌మిల్లు) రూ.2 లక్షల చెక్కును విరాళంగా ఇచ్చారు. వీరంతా ఎమ్మెల్యే బేబీనాయన చేతులమీదుగా సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేశారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌డీవో సాయిశ్రీ

బొబ్బిలి: లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని, ఎవరైనా లింగ నిర్ధారణ చేసినా, చేయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌డీవో ఎ.సాయిశ్రీ హెచ్చరించారు. మండల కేంద్రంలోని తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం ఆమె సమావేశమై, పీసీ, పీఎన్‌డీటీ చట్టాల అమలుపై చర్చించారు. గర్భంలో శిశువు ఉండగానే ఆ బిడ్డ ఆడా.. మగా.. అని తెలుసుకోవాలనే ఆలోచన తప్పు అన్నారు. గర్భస్థ లింగ నిర్ధారణకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ జి.సంతోషికుమారి, డాక్టర్ రోజారాణి, ఎస్‌ఐ జి.లోవరాజు, న్యాయవాది జగన్నాథరావు పాల్గొన్నారు.

బ్రహ్మాస్త్రంతో చీడపీడల నివారణ



బ్రహ్మాస్త్రం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రాజాం: పంటలకు పట్టే చీడపీడల నివారణకు బ్రహ్మాస్త్రం ఎంతగానో ఉపయోగపడుతుందని ఏవో రేణుకాసాయి, ప్రకృతి వ్యవసాయం ఎల్‌వన్ పి.రమాదేవిలు అన్నారు. మండలంలోని నందబలగ గ్రామంలో బ్రహ్మాస్త్రం తయారీపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. వేప, కానుగ, సీతాఫలం, బొప్పాయి, జామ జాతులకు చెందిన ఆకులు రెండు కిలోల చొప్పున తీసుకుని, దానికి పది లీటర్ల ఆవుమూత్రం కలిపి ఐదు పొంగులు వచ్చేంత వరకు మరిగించాలని, అనంతరం ఆ మిశ్రమాన్ని 24 గంటలు ఉంచి, చల్లారిన తర్వాత బ్రహ్మాస్త్రం తయారవుతుందన్నారు. ఇలా తయారైన దానిని(ఐదు లీటర్ల బ్రహ్మాస్త్రం) 100 లీటర్ల నీటిలో కలిపి ఎకరా వరి పొలంలో పిచికారీ చేయాలని వివరించారు. ఇలా చేయడం ద్వారా రసాయనిక ఎరువుల వాడకం, పెట్టుబడి తగ్గి, అధిక దిగుబడులు వస్తాయన్నారు. పంటను పట్టి పీడిస్తున్న గొంగళి పురుగు, పచ్చపురుగు, కాండంతొలిచే పురుగులను బ్రహ్మాస్త్రం నివారిస్తుందన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ టి.అరుణ తదితరులు పాల్గొన్నారు.